
**కామెడీ కథ**

**ఇన్‌స్పెక్టర్ నీలకంతం మీద అతడి పరోక్షంలో చాలామంది చాలా రకాల జోకులేస్తూంటారు. "గురుడు పెళ్లిపీటల మీద కూర్చున్నప్పుడు ఫొటో కోసమైనా చిరునవ్వు నవ్వి వుండడని ఎంతంటే అంత పందెం" అంటాడో సహోద్యోగి.**




''బెడ్ టైంలో కూడా భార్యతో సరదాగా సరసంగా మాట్లాడడుగాక మాట్లాడడు. ఏం మనిషో ఏమో!'' బెడ్రూంలోకి తొంగి చూసొచ్చినంత ఖచ్చితంగా చెబుతాడో కానిస్టేబులు.

''అసలువాడు నీలకంతం కాదోయ్. తారుడబ్బా మొఖం! ఎప్పుడూ జిడ్డోడుతూ చిటపటలాడ్తూ శాడిస్ట్‌లా మాట్లాడుతూ-నేస్టీఫెలో. కరక్టుగా చెప్పాలంటే హిగ్‌మేన్ అనుకో'' మొహం అసహ్యంగా పెట్టుకుని మరీ అంటాడో పై అధికారి.

''వాడి మొఖం! వాడు పోలీసు ఇన్‌స్పెక్టరేంటీ. అసలా మొఖం ఏంట్రా బాబూ ఎప్పుడూ పేలాలు వేగుతున్నట్లుంటుంది. నవ్వితే వాడి సొమ్మేదో పోతుందన్నట్టు ఏడుస్తూంటాడు. ఏదైనా విషయం గురించి మాట్లాడదామని వెళ్తే చాలు మనం నోరు విప్పేలోగా మీద పడి కరిచేస్తాడు. హారిబుల్ మనిషి!'' అంటాడు పోలీస్‌స్టేషన్‌తో బిజినెస్ చేసే ఓ బ్రోకర్.

అలాంటి నీలకంతం దగ్గరికి అతగాడు స్టేషన్లో ఇక్ష్వాకుల కాలం నాటి కుర్చీలో కూర్చునుండగా రయ్‌మని దూసుకొచ్చాడు పరబ్రహ్మం.

ఖద్దరు లాల్చీ ఖద్దరు పైజమా నల్లకళ్ళజోడూ, తెల్లజుట్టూ భుజానికి వేలాడుతూ నల్లగుడ్డ సంచీ వెరశి పరబ్రహ్మం. అతడితోబాటు కుర్రాళ్ళు గాక పెద్దవాళ్ళూగాక మధ్యస్తంగా వుండేవాళ్ళో ఇద్దరు కూడా వచ్చారు.

వస్తూనే ''అయ్యా నమస్కారం. నన్నంతా పరబ్రహ్మం అంటారు'' అంటూ షేక్‌హేండ్ కోసం చెయ్యి చాచాడు.

చెయ్యివ్వలేదు నీలకంతం. 'అయితే ఏంట్రా ఏబ్రాసినాకొడకా' అన్నట్టు ఓ లుక్కేశాడు.

సదరు లుక్కుని పట్టించుకోకుండా చొరవగా చెయ్యి అందుకుని ఊపేస్తూ ''కంగ్రాట్యులేషన్స్ సార్'' అన్నాడు.

అదిరి పడ్డాడు నీలకంతం. పొరబాటున తనకే పోలీసు పతకమో ప్రకటించారేమో, వీళ్ళు పత్రికా విలేఖరులేమో ముందుగా తెలిసి ముందుముందుగా వచ్చి అభినందిస్తున్నారేమో నన్ను. ఓ ఊహ 'ఝుణక్' మంటూ గుండెల్లో స్పార్కింది.

''ఏ..ఏవిటీ..ఏవయ్యిందీ'' తడబడుతూ అడిగాడు. మొహంలో ఎలాంటి ఫీలింగు పెట్టాలో తెలీక మరింత కంగారుపడ్డాడు కూడా. పరబ్రహ్మం అనుచరులు కూడా అభినందించేశారు.

''కూర్చోండి. అసలేవిటి సంగతి''

''చెబుతా. మనవి చెయ్యడానికే కదా వచ్చిందీ'' సంచిలోంచి తాపీగా ఓ ఫైలు బయటికి తీసి అందులోని ఓ పేజీలోని అంశాలు నాటకీయంగా చదివేడు పరబ్రహ్మం.

''మీ పై అధికారుల్లో 52% మీరు కార్యదక్షుడని పేర్కొన్నారు''

''ఏవిటి నా గురించే? యూ మీన్ నీలకంతం గురించే?''

''అవును. అక్షరాలా ఆముదాల నీలకంతం గురించే అన్నారు. ఇకపోతే మీరు స్ట్రిక్టు ఆఫీసరని మీ సబార్డినేట్లలో 68% అన్నారు''

''ఏవిటి నా గురించి నా కింది వాళ్ళు అలా అన్నారా?'' దూరాన వున్న పీసీల వంకోసారి ఎగాదిగా చూసి మరీ అడిగాడు.

''ఇది నా మాట కాదు. మా సర్వే చెబుతున్న సత్యం వినండి మరీ. మీ స్టేషన్ పరిధిలోని జనం 83% మీరు ఉత్తమపోలీసు అధికారి అని చెప్పేరు''

మూర్ఛపోయి నిలదొక్కుకున్నాడు నీలకంతం ''నా గురించే? వాళ్ళంతా నన్నెరుగుదురా? నమ్మలేకపోతున్నానే?!''

''మీరేంటో మీ శక్తేంటో మీకు తెలీదు. మీరు హనుమంతుడుళ్ళాటి వాళ్ళు. మీరేంటో మీకే కాదు మొత్తం త్రిపుర జనావళికి చాటి చెప్పాలన్నదే మా ఆశయం''

''త్రిపురవా? త్రిపురాసురుడుండేవాడు అదా?''

''భలే జోక్ వేశారు సార్'' గట్టిగా నవ్వి తక్కున ఆగి అన్నాడు ''సైబరాబాద్‌తో కలిసి మన జంటనగరాలు మూడు నగరాలయ్యాయి కదండీ. అదన్నమాట. ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే అత్యధికులు మిమ్మల్ని ఉత్తమోత్తముడిగా ఎన్నుకున్నారు గనుక ఈ సంవత్సరపు విశిష్టవ్యక్తి అవార్డుని మీకిచ్చి సత్కరించాలని మా హైదరాబాద్ ఆస్కార్ అవార్డ్స్ కమిటీ నిర్ణయించింది''

నీలకంతానికి నిజంగానే స్పృహ తప్పింది. కానీ వెంటనే తిరిగి స్పృహలోకొచ్చేశాడు.

కానీలోగానే పరబ్రహ్మం పెద్దగొంతుతో అరుస్తున్నట్టుగా ''మీ సార్‌కి విశిష్టవ్యక్తి అవార్డొచ్చిందోయ్. ఇంకా అలా నిలబడ్డారేవిటి'' అన్నాడు పీసీలతో.

వాళ్ళూ సెంట్రీలు అంతా తోసుకొచ్చి మరీ అభినందనలు గుప్పించేశారు. ఎస్సై ఒకడుగు ముందుకేసి స్టేషన్ ముందు అమ్ముతోన్న మల్లెపూలదండ మూడు మూర్లని డబ్బులివ్వకుండా తెచ్చి మరీ మెళ్ళో వేశాడు.

నవ్వబోతూ ఇబ్బందిపడ్తూ ఆశ్చర్యబోతూ అయోమయంగా చూస్తూ...రకరకాల ఫోజుల్లో అభినందనలు స్వీకరించాడు నీలకంతం.

''మీ సెలక్షన్ అద్భుతం సార్. మా బాస్‌కి అవార్డెప్పుడిస్తున్నారు?'' ఎస్సై అడిగాడు మస్కా కొట్టడానికిదే అదనని భావించి.


''ఎప్పుడో ఏవిటి వచ్చే నెలలోనే. మీ డీజీపీ ఎప్పుడు డేట్ ఇస్తే అప్పుడు''

''అవార్డుని డీజీపీ ఇస్తారా?'' కళ్ళు తిరుగుతోంటే అడిగాడు ఎస్సై.

''ఈ మహానగరానికే విశిష్ట వ్యక్తి కదా అంతకు తక్కువ వాళ్ళతో ఎలా ఇప్పిస్తాం? అసలు నాకో డౌటు. మా హైదరాబాద్ ఆస్కార్ అవార్డ్స్ కమిటీ గురించి మీకు బొత్తిగా జ్ఞానం లేనట్టుంది''

పరబ్రహ్మం తన గాలి తీసేస్తున్నట్టు ఫీలయ్యాడు ఎస్సై. ''భలేవారే. మీ సంస్థ గురించీ మీ గురించీ నాకు తెలీకపోవడం ఏవిటి. మీరు మీ సంస్థ చాలా గ్రేట్. టీవీలో తరచూ చూస్తుంటాను కదా. మీరు సన్మానించారూ అంటే వాళ్ళు నిజంగా చాలా చాలా గ్రేటైనట్టే..వుంటాను సార్. కొంచెం పనుంది'' అంటూ జారుకున్నాడతడు.

అవార్డు తనకే ఇస్తున్నారనీ అది చాలా గొప్పదనీ అర్థమైపోయింది నీలకంతానికి. రైటర్ని పిలిచి ''సార్‌కేమీ తాగిపించవా? వెళ్ళు స్పెషల్ ఛాయ్ పట్రా'' అని విసుక్కోబోయి సగంలో ఆ ఫీలింగ్సుని మింగేసి ప్రసన్నంగా చూడటానికి తంటాలు పడ్డాడుగానీ ఆ భావాన్ని మొహం సరిగ్గా పలికించలేకపోయింది.



నీలకంఠం స్టేషన్‌కొచ్చిన వారిని అదిలించడం బెదిరించడం విసుక్కోవడం కరవడం తప్ప మర్యాద చేసిన దాఖలాలు మచ్చుకి కూడా లేవు. అలాటిదిప్పుడు టీ ఇచ్చి మరీ మాట్లాడుతూండటం చూసి తనకి తనే ఆశ్చర్యబోయాడు నీలకంఠం. స్టేషన్ సైతం ముక్కు మీద వేలుంచుకుంది.

''ఒక్కమాట. మీ గురించి సావనీర్లో ఘనంగా ప్రచురించటానికి మీ ఫోటో బయోడేటా మీ ఘనకార్యాల వివరాలూ కావాలి''

''ఆఖరిది కొంచెం కష్టం. చిన్న దొంగల్నీ చిల్లర దొంగల్నీ పట్టుకున్నానుగానీ..''

''ఆ సంగతి మీకు తప్ప లోకానికి తెలీదు కదా. అంచేత మీ సర్వీసులో మీరు విన్న కన్న గొప్ప గొప్ప కేసుల గురించి నాలుగు ముక్కలు రాసివ్వండి చాలు అవన్నీ మీరే చేసినట్టు సినిమా రచయిత చేత అందంగా రాయించి ప్రచురించేస్తాను. ఏమంటారు?''

''బావుంటుందా అని..''

''బాగోక ఛస్తుందేవిటి. పైకి గొప్పగా కన్పించే వాళ్ళందరిలోపలా వున్నది వట్టి డొల్లే. ఇంకేం అడ్డు ప్రశ్న వేయకుండా అలా కానిచ్చేయండి. ఒక్కవారం పదిరోజుల్లో వచ్చి మీ దర్శనం చేసుకుంటాను. శెలవు మరి. నమస్కారం''

పరబ్రహ్మం అతడి శిష్యులూ వెళ్ళిపోయారు.

తనకేదో అయినట్టూ గాలిలో తేలిపోతున్నట్టూ వుంది. కదిల్తే లేస్తే ఎక్కడ ఆ ఫీలింగు పోతుందో అన్పించి అలాగే బిగుసుకుపోయి కూర్చునుండిపోయాడు నీలకంఠం.

ఘనకార్యాల గురించి ఐడియాలు రాక తర్వాత కంగారుపడేకన్నా ఇప్పట్నుంచే రాసుకుంటూపోతే మంచిదనిపించింది. వెంటనే పేపర్ తీసుకుని నక్సలైట్లను పట్టుకోవడం, టేకు స్మగ్లింగ్ ఆపడం, గంజాయి తోటల్ని ధ్వంసం చేయడం రాశాడు. తనని తాను సినిమా హీరోలా ఊహించుకుంటూ మరికొన్ని రాశాడు.

ఇదంతా చదివిన సినిమా వాళ్లు వ్యాసకన్నా తను గొప్పవాడనుకుని 'ఎస్పీ నీలకంఠం' అంటూ సినిమా తీస్తారేమో అన్పించింది.

**సింహప్రసాద్**

అతడి పెదాల మీద తొలిసారిగా చిరునవ్వు మొగ్గ తొడిగింది. మనసులో మల్లెల మాలలూగాయి. మరోలోకంలో విహరిస్తూ ఎంతసేపుండిపోయాడో అతడికీ తెలీదు. చెవికోసిన మేకలా అరవకుండా కామ్‌గా సీట్లో కూర్చునుండటం ఇదే ప్రథమం.

లంచ్‌టైంలో లేచి ఎస్సైనీ ఓ కానిస్టేబుల్నీ పలకరించాడు. ఒకరి పిల్లల చదువుల గురించీ రెండో వారి అమ్మాయి కాపురం గురించీ నాలుగు ముక్కలడిగి వాళ్ళూషాక్ నుండి తేరుకునే లోపలే బయల్దేరి ఇంటికెళ్ళాడు.

ఏదో పనిలో వున్న భార్య రెండు నిమిషాలాలస్యంగా మంచి నీళ్ళు తెచ్చింది. ఉరుము ఉరమడం ఖాయంరా దేవుడా అని చిన్నగా వణికిందిగానీ ఉరుముబదులు మెరుపు మెరిసేసరికి కలా గ్రాఫిక్ వర్కాని ఆశ్చర్యబోయింది.

''అలా వీక్‌గా వున్నావేంటి? రెస్టు తీసుకుంటూ వుండు. రోజుకో ఫ్రూట్ అయినా తినాలి. అప్పుడే ఆరోగ్యం బావుంటుంది. ఓసారి లేడీ డాక్టర్ చేత చెకప్ చేయిద్దామా?''

''అబ్బే వద్దండీ.'' అని పైకి. 'మీరిలా వుంటే

సంబరంతో రెట్టింపు ఆరోగ్యంతో ఉబ్బిపోనూ?' అని లోపలా అనుకుంది.

సాదావే అయినా కూరల్ని మెచ్చుకుంటూ భోంచేసి ఓ కునుకు తీశాడు.

స్కూలు నుంచి పిల్లలొచ్చారు. తండ్రిని పులిలా చూశారు గానీ అతడు పిల్లిలా మారి పిల్లల్ని దగ్గరికి తీసుకుని స్కూలు విశేషాలడిగాడు. వారి ఆనందం అంబరాన్ని తాకింది.

మళ్ళీ డ్యూటీకెళ్ళాడు. ఏసీపీ ఫోన్ చేసి అభినందించాడు.

''ఎవరితోనూ కలవకుండా బెల్లంకొట్టిన రాయిలా వుంటే ఏంటో అనుకున్నాను. నీకు పట్లూ సీక్రెట్ వర్కువుట్లూ బాగా తెలుసే. అవార్డుని భలేగా అరేంజి చేసుకున్నావు. నాక్కూడా ఏదైనా చూడవోయ్. న్యూస్‌లో వుంటేనే పైవాళ్ళు మనల్ని గుర్తిస్తారు. చక్కని పోస్టింగిస్తారు. మర్చిపోకేం'' అన్నాడు.

దాంతో ఏనుగెక్కినట్టుగా సంబరపడిపోయాడు నీలకంఠం. అంతా లోపాయికారీగా ప్రయత్నించి ఒక రకంగా కొనుక్కునే అవార్డు తనని అనాయాసంగా వరించింది. అంటే తను నిజంగా విశిష్ట వ్యక్తే. అంచేతిహ నుంచి బెల్లంకొట్టిన రాయిలాగాక కొత్త కరెన్సీనోటులా ఫెళఫెళలాడుతూ వుండాలని తీర్మానించేసుకున్నాడు. సన్మానంతరం మారబోయే తన పరిస్థితి గురించీ ప్రమోషన్ గురించీ రకరకాలుగా ఊహించుకుని మురిసిపోయాడు.

పరబ్రహ్మం వచ్చి ఫొటో బయోడేటా వివరాలూ చూసి ''మా సర్వే ఎంత కరక్టో ఇవి చూస్తోంటే మీకన్పించట్లేదూ? మీరు నిశ్చయంగా విశిష్ట వ్యక్తే. వచ్చేవారం వచ్చి సన్మానం డేట్ చెబుతాను. నమస్కారం'' అనేసి వెళ్ళిపోయాడు.

అతడి మాటలెంతో నిజంగా అన్పించాయి. 'నేను విశిష్ట వ్యక్తినే. ఇక అలాగే ప్రవర్తిస్తూండాలి' అనుకున్నాడు మళ్ళీ మళ్ళీ.

## సిమ్రాన్ దూకుడు


**సిమ్రాన్ ఇప్పుడు డైరెక్టర్‌గా అవతారం ఎత్తుతున్నట్టుంది. ఫరేబి చిత్రం షూటింగ్‌లో ఆమె చేష్టలు నిర్మాత, దర్శకుల్ని చిక్కుల్లో పడేసాయి. షూటింగ్ సందర్భంగా వివిధ సీన్స్‌ల చిత్రీకరణలో జోక్యం చేసుకుంటూ ఇటు నటిగా, అటు దర్శకురాలిగా దూకుడుతో వ్యవహరిస్తోంది. ఈమె ప్రవర్తనతో విసిగి వేసారిన యూనిట్ వాళ్ళు ఆమెని సాగనంపాలని ప్రయత్నించారు. హాలీవుడ్ చిత్రం 'డియాబొలిక్' ఆధారంగా తీస్తున్న ఈ చిత్రం సిమ్రాన్ పుణ్యమా అని వార్తల్లోకి వచ్చేసింది.**

స్టేషన్ పరిధిలోని బడావ్యాపారుల్లో ఇరవైమంది దాకా ఫోన్ చేసి అభినందించారు. కొందరు అవార్డు రావడం నిజమేనా అని అడిగి సందేహం తీర్చుకున్నాక కంగ్రాట్ చేశారు.

తన పాపులారిటీ గ్రాఫ్ పైపైకి పోతున్నందుకెంతో మురిసిపోయాడు. తర్వాత మీ అభినందన సంచికలో ప్రచురణకి ఎడ్వర్టయిజ్‌మెంట్లిచ్చామని కొందరు వ్యాపారులు చెప్పేరు. కించిత్తు ఇబ్బంది పడ్డా ''థాంక్స్‌ఏయ్. నిస్వార్థంగా పనిచేసే సంస్థల్ని మీలాంటి వాళ్ళు ప్రోత్సహించాలి'' అన్నాడు నీలకంఠం.

నీలకంఠం పద్ధతిలో ప్రవర్తనలో మాటలో ముఖంలో చాలా మార్పు వచ్చేసింది. ఒక రకమైన సుపీరియారిటీ కాంప్లెక్సుతో ప్రవరిస్తున్నాడు. అంతా ప్రత్యేకమైన వ్యక్తిగా చూస్తూండటంతో మరింత ఉత్సాహంగా వుంది. ఇన్నేళ్ళూ పోగొట్టుకున్నదేంటో తెలిసి వచ్చింది. ఏదేదో చేసేసి హీరో అన్పించుకోవాలన్న తపన మొదలైంది. ఇంకెప్పటికీ ఇలాగే వుండిపోవాలనుకున్నాడు.

కేసుల దర్యాప్తులో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ సబార్డినేట్స్‌కి ఉత్సాహమిస్తున్నాడు. ఓ దోపిడీ దొంగల ముఠాని పట్టుకుని డీసీపీ ప్రశంసలందుకున్నాడు. మరి పది రోజులు గడిచాయిగానీ పరబ్రహ్మం జాడలేదు. అతడి ఫోన్ నెంబరుగానీ సంస్థ ఎడ్రసుగాని తెలుసుకోనందుకు చాలా నొచ్చుకున్నాడు. కొలీగ్స్, వ్యాపారులూ సన్మానం ఎప్పుడని అడుగుతోంటే ఏం చెప్పాలో తెలీక ఏదేదో చెబుతూ పరబ్రహ్మం కోసం తీవ్రంగా గాలించాడు.



హైదరాబాద్ ఆస్కార్ అవార్డ్స్ కమిటీ గురించి చాటుగా కొందర్ని ఎంక్వైరీ చేశాడుగానీ వాళ్ళలాంటి పేరే విన్లేదనేసరికి తేలుకుట్టిన దొంగలా వుండిపోయాడు.

పరబ్రహ్మం మీద ఆగ్రహం మాత్రం కొండంత పెరిగిపోయింది. కన్పిస్తే నమలకుండా మింగేయ్యాలన్నంతగా ఊగిపోయాడు కూడా.

సరిగ్గా అప్పుడతడ్ని సిటీలోని మరో స్టేషన్‌కి ట్రాన్స్‌ఫర్ చేశారు.

'హమ్మయ్య. ఇక సన్మానం గురించెవడూ అడగడు. ఇదీ మన మంచికే' అనుకుంటూ జోరుగా హుషారుగా కొత్తస్టేషన్‌కెళ్ళాడు నీలకంఠం.

అంతా ఎంతో మర్యాదగా ఆహ్వానించారు. స్థానిక ప్రముఖులొచ్చి అభినందించారు.

''మా సిఐ సార్ చాలా గ్రేట్. లాస్ట్ ఇయర్ విశిష్ట వ్యక్తి అవార్డు ఇచ్చారు తెలుసా'' అని అంతా చెప్పుకోవడం విని పరమానందపడిపోయాడు నీలకంఠం.

'పోనీలే. సన్మానం చెయ్యకపోతేనేం పేరూ గుర్తింపూ వచ్చాయి. అదే పదివేల సన్మానాల పెట్టు' అనుకున్నాడు.

ఒకరోజున మంత్రిగారి కోసం బందోబస్తు పర్యవేక్షిస్తోంటే పరబ్రహ్మం కన్పించాడు. మరొక్క క్షణం ఆలస్యం చెయ్యకుండా అతడి దగ్గరకి దూసుకుపోయాడు నీలకంఠం.

అతడో పీసీని ''మీ కొత్తసార్ పేరేంటి? ఎక్కడెక్కడ చేశారు?..'' వగైరా వివరాలు అడుగుతూ నోట్ చేసుకుంటున్నాడు.

''పరబ్రహ్మం''

అదిరిపడి వెనుదిరిగిన పరబ్రహ్మం నీలకంఠాన్ని చూసి వజవజ వణికిపోయాడు.

అతడి రెక్కపట్టుకుని ఓ పక్కకి ఈడ్చుకుపోయాడు.

''తప్పైపోయింది సార్. పిల్లలుగలవాడ్ని. ఏదో నాలుగు రాళ్ళు సంపాదిద్దామనీ. అంతేసార్..నాకే దురుద్దేశం లేదు సార్.'' ప్రాధేయపడ్డాడు పరబ్రహ్మం.

అమాంతం అతడ్ని ఆప్యాయంగా కావలించుకున్నాడు నీలకంఠం.

''థాంక్స్‌ఏయ్. పొగడ్త పన్నీరులాంటిదే. నువ్వు నాచేత పన్నీరు తాగిపించలేదు. పైపైన చిలకరించావంతే. అది చాలు. అదే నన్ను మార్చేసిందోయ్. ఆనందమంటే ఏంటో అభిమానమంటే ఏంటో గౌరవమంటే ఏంటో నీవల్లే తెలిసొచ్చిందోయ్''

నీలకంఠం మాటలకి స్పృహ తప్పుతున్నట్టుగా అన్పించింది పరబ్రహ్మానికి!